


ఏమీ తెలియనివాడు అజ్ఞానంలో పోతాడు. అన్నీ తెలిసినవాడు మరింత అజ్ఞానంలో పోతాడు.

— ఒక సూక్తి

నేను:-

"రాజీ పడలేకపోవటంకన్నా గొప్ప నరకం లేదు జీవితంలో."

ఆ మాటలకు తలెత్తాను. ఎవరితోనో అంటున్నాడు చైతన్య. దాదాపు పది రోజుల నుంచి అతనిలో విపరీతమైన మార్పు కనిపిస్తోంది.

చైతన్య మొహంలోకి సూటిగా చూశాను. ఏదో బాధ, విషాదం కనిపిస్తున్నాయి. తన వయసుకన్నా చాలా పెద్దవాడిలా అనిపించాడు ఆ క్షణం.

సిగరెట్ నోట్లో పెట్టుకుని వెలిగించటానికి ప్రయత్నిస్తున్నాడు. ఆశ్చర్యం వేసింది. ఆఫీసులో అందరూ కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తున్నారా దృశ్యం.

నేనూ, చైతన్యా చిన్నప్పటి నుంచి స్నేహితులం. ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాం. చాలా మంచివాడు చైతన్య. మితిమీరిన మంచితనం అని చెప్పాలి నిజంగా. పదింటికి ఆఫీసు అయితే తొమ్మిదిన్నరకే సీట్లో వుంటాడు. ఎప్పటి పని అప్పుడే పూర్తి చేస్తాడు.

లంచంగా లక్షలిచ్చినా తీసుకోడు. ఏ చెడు అలవాటూ లేదు. పదేళ్ళ సర్వీసులో అతనింత వరకూ ఎవ్వరి మనసూ నొప్పించి ఎరుగడు.

సిగరెట్ పొగ పీల్చి ఆ ఘాటు భరించలేక దగ్గాడు చైతన్య. సిగరెట్ జారి నేలమీద పడింది. కళ్ళనిండా నీళ్ళు తిరగాయి. విడవలేక నవ్వుతూ అటు ఇటూ చూశాడు. అందరూ తలలు తిప్పుకున్నారు. చైతన్య సిగరెట్ తాగటం- అదీ ఆఫీసులో సీట్లో తాగటం వింత అందరికీ.

నావంక చూసి చప్పున తల వంచుకున్నాడు. ఎందుకో నవ్వూ, జాలీ రెండూ కలిగాయి నాకు. కాలేజి రోజుల్లో మంచి కవిత్వం రాసేవాడు చైతన్య. ఎందుకో హఠాత్తుగా మానేశాడు. అర్ధరాత్రుళ్ళు లేచి నిశ్శబ్దపు వీథుల్లో ఒంటరిగా గంటలకొద్దీ తిరిగేవాడు. వెన్నెల్లో పచ్చిక మైదానాలలో కూర్చుని ఆకాశంకేసి అలా చూస్తూ వుండిపోయేవాడు. ఏదో వెతుకుతూ వున్నట్లు వుండేవి అతని కళ్ళు ఎప్పుడూ.

నన్ను పిలవటంతో తలెత్తి చైతన్య వంక చూశాను.

"వెళ్ళిపోదామా" అడిగాడు.

టైం చూశాను. ఆఫీసు వదలటానికి ఇంకా

# అహాంత్రికం

## శైలకుమార్

అరగంట వుంది. అయినా పిలిచింది చైతన్య. అందుకే లేచాను.

ఇద్దరం మౌనంగా నడుస్తున్నాం. ఇంటి మలుపు తిరగబోతూ వుంటే చేయిపట్టి ఆపాడు.

"బజారు కెళదాం"

అతని ముఖంలోకి చూశాను. ఏ భావమూ కనిపించటం లేదు. సాధారణంగా ఆఫీసు వదలిన వెంటనే ఇంటికి వెళ్ళిపోతాడు చైతన్య.

"పద" అంటూ నడిచాను అతనితోపాటు.

ఇద్దరం ఇరానీ హోటల్‌లో కూర్చున్నాం టీ తాగుతూ. రకరకాల మాటలు, సిగరెట్ల పొగ ఆ హోటల్‌నిండా.

"ఎందుకు అదోలా వున్నావు?" అడిగాను.

"ఎలా వున్నాను?" ఎదురు ప్రశ్న వేశాడు.

"ఏదో పోగొట్టుకున్నవాడిలా."

"పోగొట్టుకోవటానికి మన దగ్గర ఏముంది..." నవ్వుతూ అన్నాడు.

"ఎందుకంత నిరాశ?" కోపంగా అన్నాను.

"ఇది నిరాశా!?"

"ఏమీ లేదనుకోవటం నిరాశ కాదూ!"

"ఉందనుకోవటం భ్రమ అవుతుందేమో..." బరువుగా అన్నాడు.

చైతన్య స్థితి నాకేమీ అర్థం కాలేదు. కొన్ని నిముషాలు మౌనంగా గడిచాయి.

"తాగుదామా" అడిగాడు చైతన్య.

"ఇప్పుడేగా తాగాం."

"టీ కాదు"- కొన్త ఆగి అన్నాడు "మందు" అని.

ఆశ్చర్యపోయాను. కాలేజీ రోజుల్లో ఎందరు స్నేహితులు ఎంత ఒత్తిడి చేసినా మందు ముట్టలేదు చైతన్య.

"అసలేమిట్రా నీ బాధ" అనునయంగా అడిగాను.

"ఏమీ లేదు. ఆ అనుభవం ఎలా వుంటుందో చూద్దామని..."

"వద్దురా. అలవాటైతే కష్టం"

"చేసుకోను. చేసుకుంటే అదీ రొటీన్ అయిపోతుంది."

లేచాడు చైతన్య. ఇక ఎంత చెప్పినా వాడు వినడని నాకు బాగా తెలుసు. ఇద్దరం బార్ కేసి కదిలాం.

గడ గడ తాగేశాడు మొదటి పెగ్గు. రెండవ పెగ్గు పూర్తయ్యే సరికి పిచ్చి పిచ్చిగా మాట్లాడటం ప్రారంభించాడు.

నిషా ఎక్కిందని అర్థమైంది. బలవంతంగా రిక్షా ఎక్కించి ఇంటి దగ్గర దింపాను. లోపలికి వెళ్ళటానికి భయం వేసింది వాడి భార్య ఏమంటుందో నని.

"మీ కొచ్చే ఆదాయానికి ఈ అలవాటు కూడానా" నిముగ్గా వినిపిస్తున్నాయి ఆమె మాటలు.

### చైతన్య:-

ఉదయమే భార్య తట్టి లేపేసరికి మెలుకువ వచ్చింది చైతన్యకు. లేచి మంచం మీద కూర్చున్నాడు. కాఫీ అందించి మళ్ళీ వంటగదిలోకి నరుగెత్తింది ఆమె.

కాఫీ కప్పు చేతిలో పట్టుకుని గది గోడలకేసి, అలమరాల కేసి చూశాడు చైతన్య. అవే గోడలు. అవే వస్తువులు. ఏ మార్పూ లేదు పదేళ్ళ నుంచి. రోజూ ఆ సమయానికే నిద్ర లేస్తాడు. అవే గోడల్ని చూస్తాడు. అదే ఇల్లు. అదే కిటికీ. అదే మంచం- అన్నీ అవే. అద్దె పెరగటం తప్ప ఏ మార్పూ లేదు.

"మనదీ ఒక ప్రబతుకేనా
కుక్కల వలె, నక్కలవలె" శ్రీశ్రీ గుర్తుకొచ్చాడు. గుండె నిండా బాధ.

ఖాళీ బిందె పట్టుకుని వచ్చి ఎదురుగా పెట్టింది భార్య.

"ఇంకా అలాగే కూర్చున్నారా. మంచినీళ్ళు పట్టండి. ఆలస్యమైతే ఆగిపోతాయి" తొందర చేసింది.

అవును. ఆలస్యమైతే అన్నీ ఆగిపోతాయి. అవసరమైనపుడే అందుకోవాలి. కనీసం అందుకునే ప్రయత్నమన్నా చెయ్యాలి.

భార్య ముఖంలోకి చూశాడు చైతన్య. చెదిరిన తల, జారిన బొట్టు, ముఖమంతా జిడ్డు, పొయ్యి అంటించటంవల్ల చేతుల నిండా మసి.

అదే ముఖం. అదే భార్య. ప్రతి ఉదయం అదే దర్శనం.

"భర్తకు అందంగా కనిపించాలని భార్యలు ఎందుకు అనుకోరో?" చలం ఛెళ్ళున వీపు మీద కొట్టాడు.

నవ్వొచ్చింది ఆ క్షణం చైతన్యకు. ఆ మాట తాను అంటే "మీ సంపాదనకు సోకులొకటే తక్కువ" అనేస్తుంది వెంటనే.


సంపాదన మీదే ఆధారపడి వున్నాయి బంధాలూ, అనుబంధాలు అన్నీ. మిగిలినదంతా భ్రమ. కేవలం నటన. మార్క్స్! ఎంత నచ్చి నిజం చెప్పావయ్యా!

బిందె తీసుకుని కదిలాడు చైతన్య. ఆ సమయంలో రోజూ అంతే. నాలుగిళ్ళకు వున్న ఒకే ఒక్క కొళాయిలో తోసుకుంటూ నీళ్ళు పట్టాలి. తరువాత స్నానం, తినటం, ఆఫీసుకు బయలుదేరటం.

ఏ మార్పూ లేదు. ఏ మార్పూ రాదు. వస్తుందన్న నమ్మకమూ లేదు.

వంట పూర్తయినా భోజనం చెయ్యకుండా ఆఫీసుకు బయలుదేరాడు చైతన్య. అదే రోడ్డుమీద నడుస్తున్నాడు అన్ని రోజుల నుంచీ. అదే బస్సు ఎక్కుతున్నాడు.

నిముగ్గా వుంది చైతన్యకు. భరించలేనంత నిసుగు, భయంకరమైన నిసుగు. తాను తప్ప అందరూ ఆనందంగా వున్నట్లు అనిపిస్తోంది.



బహుశా ప్రతి మనిషీ అలాగే అనుకుంటాడేమో! అలా అనుకునే తృప్తి పడతాడేమో!

అతడు ఎక్కవలసిన బస్సు దూరంగా వస్తూ కనిపించింది. బస్సు నిండా జనం. దేశ జనాభాకు ప్రతీకగా జనం. ఏ రోజూ సీటు దొరకదు చైతన్యకు. ఈ బస్సు ఎక్కకూడదు అనుకున్నాడు చైతన్య. కనీసం ఆ చిన్న మార్పు అయినా తాను పొందాలి.

బస్సు కదిలింది. అప్పుడు జ్ఞాపకం వచ్చింది చైతన్యకు. తాను అది ఎక్కకపోతే ఆఫీసుకు సమయంలో చేరలేడని. ఎవరో వెనుక నుంచి తోసినట్లు పరుగెత్తాడు చైతన్య. అతి కష్టం మీద బస్సు పట్టుకున్నాడు. బస్సు ఆగినపుడు ఎక్కక అప్పుడు ఎక్కిన అతన్ని వింతగా చూశారు అంతా.

పరుగెత్తి కూడా అదే బస్సు ఎక్కాడు మళ్ళీ. పరుగెత్తి మరీ రాజీ పడ్డాడు. రాజీ పడటానికి పరుగెత్తుతున్నాడు. విసుగు భరించలేక, బయట పెట్టుకోలేక ఏడుపు తన్నుకొచ్చింది అతనికి. కాని అందరిలో ఏడవలేని అహం.

అదే ఆఫీసు. అదే సీటు. అవే ఫైళ్ళు. అదే




విసుగు. కాగితాలన్నీ చించి పారెయ్యాలనీ, టేబుల్ని విరక్కొట్టేయాలనీ, మేనేజరు చొక్కా పట్టి వీధిలోకి విసిరెయ్యాలని అనిపిస్తోంది చైతన్యకు.

ఏమీ చెయ్యలేదు. ఏమీ చేతకాదు. జుట్టు పీక్కోవాలనిపించింది. సమాజంమీద వున్న కసిని తన మీదే తీర్చుకుంటాడు బలహీనుడు.

రాత్రయింది. చాపమీద నిద్రపోతున్నారు పిల్లలు. గిన్నెలు సర్ది వచ్చి పడుకుంది భార్య. మసక మసక వెలుగు.

భార్య మీద చేయి వేశాడు చైతన్య. ఏవీ తొలినాటి పులకరింతలు. ఏవీ తొలి స్పర్శ స్పందనలు, ఏవీ మృదుత్వ మధురిమలు!

ఇదీ అంతేనా. మానవుడి అత్యంతోన్నత శిఖరానందం కూడా అలవాటైతే ఇంతేనా.

"అబ్బ" విసుక్కుంది భార్య.

"ఇటు తిరుగు"

"రోజూనా" విసుగు నటిస్తూ చైతన్య వైపు తిరిగింది తనకేమీ అవసరం లేనట్లే.

చివుక్కుమంది అతని మనసు. అవును. ఆమె వైపు నుంచి తనెప్పుడూ ఆలోచించలేదు. ప్రతి క్షణం ఏదో ఒక పనితో, పిల్లలతో ఆమె కెంత విసుగ్గా వుందో.

ఆమెపై నుంచి చేయి తీసేశాడు.

"అదేం అంతలో అలకా..." మెల్లగా హత్తుకుంది అతన్ని. స్పర్శ. ఒకప్పుడు ఆనందంతో మూర్ఛలు పోయేటట్లు చేసిన స్పర్శ, నరాల్ని మెలిపెట్టే శరీరాన్ని నమిలి మింగేసేంత కాంక్ష రేకెత్తిం



# నుదుటిపై నదిని హత్తుకుంటూ...

—డాక్టర్ సుమనశ్రీ

కళ్ళు మూసుకున్నా - కలకోసం కాదు
గాల్లో ఎగురుతూ వస్తున్న మాటను
నుదుటిపై నదితో పట్టుకుందామని
చెవిలోని హోరుకి సమాధానం చెప్పకుందామని...

అన్ని ఊపిరులూ ఆరిపోతున్న ఒక దశలో
ప్రాణాల కోసం గిజగిజలాడుతున్నా
కవిత్వజల ఉడిగి పోతుందేమోనని భయపడుతున్నా.

సముద్రపు వొడ్డున కూర్చుని
గాలిపోసుకుంటున్న నీకు
ఎడారి తహతహ అర్థం కాక పోవచ్చు-
అదొక ఆఖరి శ్వాస కాకూడదని
చిత్రాల కోసం ధ్వనుల్ని అధ్యయనం చేస్తున్నా

ప్రకృతి దృశ్యాల్ని వడబోస్తున్నా
ధ్యానిస్తున్నా- మోక్షం కోసం మాత్రం కాదు
ఒక్క అక్షర భిక్ష కోసం
మౌన సాకాశాన్ని అర్థిస్తున్నా

తలలు బాదుకుంటే తప్ప
ఒక్క కన్నీటి బొట్టు కూడా రాలటం లేదు
కళ్ళలో ఆర్ద్రత కరుణించటం లేదు
అయినా ప్రయత్నం వృథాకాదని
గుండెల్ని తడుముకుంటూ
మాటల్ని తోడుతున్నా

అందమైన మాటే కానక్కరలేదు
ఒక్క ఆర్తిని ప్రతిఫలించే మాట
స్ఫటికంలాంటి స్వచ్ఛమైన
నిజం లాంటి మాట
గుండెని కోసుకొచ్చిన మాట
తడబడే అడుగుల్తో పెదాలపై
నర్తిస్తూ వస్తున్న మాట—
ఎవరో చెవిలో విసిరేసిన
వార్తలాంటి మాట కోసం

దారాల్ని పేనుతూ మాటల్ని తోడుతున్నా
ప్రాణాల్ని నిలబెట్టుకోవాలని-
కొస్తంత కవిత్వాన్ని చప్పరిస్తున్నా
చెవిలోని హోరుని సమాధాన పరచాలని
కళ్ళు మూసుకొని
నుదుటిపై నదిని హత్తుకుంటున్నా.

---

చిన స్పర్శ. ఏదీ ఆ పరవశం? ఏదీ ఆ తుఫాను! ఆ ఆవేశం!

మెల్లగా భార్యను ఆక్రమించుకున్నాడు. అదే స్పర్శ, అదే సుఖం, అదే పడక.

చివుక్కుమంది చైతన్య మనసు. తను తప్పుగా ఆలోచిస్తున్నాడా! ఇదీ రొటీన్ అయిపోతే ఎక్కడికి పారిపోవాలి. ఇందులో శరీరానికి తప్ప మనసుకే పాత్రా లేదా!

భార్య మొహంలోకి చూసి పక పకా నవ్వాడు చైతన్య. అతనెందుకలా నవ్వాడో అర్థం కాలేదామెకు.

**తెలిసిపోయింది చైతన్యకు. పాతబడిన ప్రతీదీ విసుగే. జీవితమంతా రొటీనే. అందరి బతుకులు పేరడీలే. అందరివీ మాటల గారడీలే.**

వీళ్ళందరూ తోకలు తెగిన ఎలుకలు కలుగుల్లోంచి బయటికి రాలేరు" తిలక్ గొంతు చించుకుని అరుస్తున్నాడు.

మనిషికీ మనిషికీ మధ్య కేవలం నటన తప్ప మరేం లేదు. రొటీన్‌గానే నవ్వుతారు. రొటీన్‌గానే ఏడుస్తారు. సానుభూతి రొటీన్‌గానే చూపిస్తారు.

నవ్వాడు చైతన్య. తెరలు తెరలుగా నవ్వాడు. అంతా అర్థమైనట్లు నవ్వాడు. ఆ నవ్వులో నుంచే మెల్లగా ఏడుపు. అసలు జీవితం ప్రారంభించేదే ఏడుపుతో. కన్నతల్లి నుంచి కట్లు తెంచుకున్నది ఏడవటానికే.

ఏడుపు కూడ విసుగే.

## అజ్ఞానం:-

ఎన్నడూ లేనిది ఆ రోజు మొదటిసారిగా మేనేజరుమీద తిరగబడ్డాడు చైతన్య.

నాకేం అర్థం కావటం లేదు అతని స్థితి. అతను చెప్పటం లేదు. కాని అతనిలో ఏదో మార్పు వచ్చిందన్నది మాత్రం యదార్థం. తుఫానుకు ముందు సముద్రం పొందే మార్పు అది. కుంభ వృష్టి కురవటానికి ముందు ఆకాశంలో వచ్చే మార్పు అది.

ఆఫీసుకు సెలవు పెట్టాడు చైతన్య. రెండు



చిత్రం : P.V. సాయిరాం కొవ్వూరు

రోజులు గడిచాయి.

"చిన్నమా!

తెల్లవారుఝామునే వచ్చి నిద్రలేపాడు మా కొలీగ్ విశ్వం. అంత పొద్దున్నే అతన్ని చూసి ఆశ్చర్యపోయాను.

"బట్టలేసుకో వెళదాం" పొడిగా అన్నాడు.

"ఎక్కడికి?"

"పద చెబుతాను."

ఇద్దరం రోడ్డు మీదికి వచ్చాం.

"చైతన్య ఆత్మహత్య చేసుకున్నాడు" చాలా నెమ్మదిగా చెప్పాడు నేను షాక్ తింటానేమోనని.

నిశ్చేష్టంగా నిలబడ్డాను కొంతసేపు. దుఃఖం పొంగుతూ వుంటే కర్తవ్యం గుర్తుకొచ్చి పరుగెత్తాను వాడి ఇంటికి.

శోక సముద్రంలో వుంది ఇల్లు. శవం మీద పడి ఏడుస్తున్నారు భార్యా పిల్లలూ హృదయవిదారకంగా. అప్పటికే పోలీసులు వచ్చేశారు.

"ఇది మీ కర్థమైతే చెప్పండి. శవం దగ్గర దొరికింది" అంటూ ఓ కాగితం అందించాడు ఇన్‌స్పెక్టర్. అది చైతన్య రాతే- నాకు బాగా తెలుసు.

చదివాను. అది అక్కడున్నవారికి అర్థంకాక పోవటంలో నాకు ఆశ్చర్యం అనిపించలేదు. అందులో ఒకే ఒక వాక్యం వుంది.

**"జీవితంలో రొటీన్ కానివి రెండే. ఒకటి పుట్టుక, మరొకటి చావు. అందుకే..."**